క్లుప్తంగా

పల్లెప్రగతి పనుల పరిశీలన



నల్లబెల్లి : మండలంలోని దస్తగిరిపల్లి, ముచ్చింపుల, ముచ్చింపుల తండా గ్రామాలలో పల్లెప్రగతి పనులను మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాష్ సోమవారం పరిశీలించారు. క్రీడా మైదానాలు, మన ఊరు-మనబడి అభివృద్ధి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నర్సరీలలోని మొక్కలను కాపాడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బాలు, అనిల్, అనిత పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సంగెం : మండలంలోని మొండ్రాయిలో ఉపాధిపథకంలో భాగంగా రూ.40లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కళావతి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గూడ కుమారస్వామి, మేరుగు మల్లేశం, ఎంపీటీసీ కొనకటి రాణిమొగిలి, మండల కోఆప్షన్ సభ్యులు మన్సూర్ అలీ, నాయకులు సంపత్, ప్రతాప్, మైపాల్, రవి, కొమ్మాలు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

వరంగల్ (పర్వతగిరి) : మండల కేంద్రంలో అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేసీఆర్ లీగ్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో 22జట్లు పాల్గొనగా ఫైనల్‌కు భట్టుతండా, పర్వతగిరి-2 జట్లు చేరుకున్నాయి. ఫైనల్‌లో జరిగిన మ్యాచ్‌లో పర్వతగిరి-2 టీం బృందం విజయం సాధించింది. విజయం సాధించిన జట్టు వర్ధన్నపేటలో నిర్వహించే తదుపరి క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరంలోని 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన బండ మనోజ్‌కుమార్(22) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు గీసుకొండ పోలీసులు తెలిపారు. ఈనెల 12న సిమెంట్ బస్తాలు, ఇనుప రాడ్లను బొలెరో వాహనంలో తీసుకొని 17వ డివిజన్ వసంతాపూర్‌కు వెళ్లాడు. కాగా తిరిగి వస్తున్న క్రమం స్తంభంపల్లి మలుపు వద్ద గేదెలు అడ్డురావడంతో అదుపుతప్పి అతని వాహనం చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన మనోజ్‌కుమార్‌ను బంధువులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఎస్సై వెంకన్న తెలిపారు.

ఆర్థికసాయం



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన రాతిపెల్లి యాదగిరి సంవత్సరీకం సందర్భంగా బాల్య మిత్రులు, జెడ్పీ పాఠశాల 1986-87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి సోమవారం రూ.50 వేల సాయం అందించారు. మిత్రులు ఎస్.సుజాత, కొమ్ముల సురేందర్, ఎండీ ఖలీం, అక్బర్, సుదర్శన్, జయదేవ్ యాదగిరి కూతురు రాతిపెల్లి అక్షిత తదితరులు పాల్గొన్నారు.

గొర్రెపిల్లలపై ఊరకుక్కల దాడి

● 15 పిల్లలు మృతి

చెన్నారావుపేట : గొర్రెపిల్లలపై ఊరకుక్కలు దాడి చేయడంతో 15 పిల్లలు మృతి చెందిన సంఘటన చెన్నారావుపేట మండలం లింగాపురంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన తలబోయిన రాజు గొర్రెలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాజు గ్రామ శివారులోకి గొర్రెలను మేపడానికి వెళ్లాడు. గొర్రెపిల్లలు ఉండటంతో వాటిని ఇంటివద్దనే ఉంచి తన తల్లికి అప్పగించాడు. ఆమె మహిళా సంఘం సమావేశం వద్దకు వెళ్లిన క్రమంలో గ్రామంలోని ఊరకుక్కలు గొర్రెలపిల్లలపై దాడి చేశాయి. దీంతో 15 పిల్లలు మృతి చెందాయి. ఘటన స్థలానికి చేరుకున్న తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ మృతి చెందిన గొర్రె పిల్లలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నష్టపోయిన బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఊరకుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని వాటిని నియంత్రించాలన్నారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి స్పందించి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట బోయిని రాజు, కుక్కల సతీష్, రంజిత్, శివ, తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా శ్మశానవాటికలు

● పిచ్చి మొక్కలతో స్వాగతం
● నిర్లక్ష్యం చేస్తున్న గ్రామ పంచాయతీ పాలకులు
● పట్టించుకోని అధికారులు


పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న రంగాపురం శ్మశాన వాటిక

ఖానాపురం : లక్షల రూపాయలతో నిర్మించిన శ్మశాన వాటికలు నిరుపయోగంగా మారుతున్నాయి.. అధికారులు, పాలకుల పట్టింపులేని కారణంగా ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది..కనీస సౌకర్యాలు లేక పిచ్చి మొక్కలతో నిండిపోయింది. నిర్మాణాలు పూర్తి అయినప్పటికి వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. పట్టించుకోవాల్సిన అధికారులు తమకేమీ సంబంధం లేదనే విధంగా వ్యవహరిస్తున్న పరిస్థితి నెలకొంటుంది.

ఖానాపురం మండల వ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో శ్మశాన వాటికల నిర్మాణాలు చేపట్టారు. 20 గ్రామ పంచాయతీల్లో శ్మశాన వాటికల నిర్మాణాలు చేశారు. ఒక్కో దానికి రూ.12.60 లక్షలు కేటాయించగా పనులు చేపట్టారు. ఇందులో రంగాపురంలో నిర్మాణం చేసినప్పటికి నిరుపయోగకరంగా ఉంటుంది. శ్మశాన వాటికలో పూర్తిగా పిచ్చిమొక్కలు పెరిగి చివరిమజిలీకి ఉపయోగ పడకుండా ఉంది. శ్మశాన వాటికను పూర్తిస్థాయి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నప్పటికి గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది. రోడ్డుపక్కనే ఉండగా నిత్యం అటువైపుగా అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్తున్నారే తప్ప ఎవరు పట్టించుకోవడం లేదు. అలాగే మండలంలోని మంగళవారిపేట, భద్రుతండాతో పాటు పలు గ్రామాల్లో దారులు సరిగాలేక అందుబాటులోకి రాకుండా పోతున్నాయి. గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మాణాలు చేసినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అందుబాటులోకి రాకుండా పోతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శ్మశాన వాటికల్లో పిచ్చి మొక్కలను తొలగించి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రజలు వాపోతున్నారు.

పిచ్చి మొక్కలు లేకుండా చేస్తాం



శ్మశాన వాటికల్లో పిచ్చి మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. శ్మశాన వాటికల్లో పిచ్చి మొక్కలను తొలగిస్తాం. అందుబాటులోకి రానివాటిని పరిశీలించి చర్యలు చేపడతాం. గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చేస్తే ఉన్నతాధికారులకు నివేదించి కఠిన చర్యలు తీసుకుంటాం.

\- రవి, ఎంపీఓ, ఖానాపురం

లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలి

● ఎమ్మెల్యే అరూరి రమేష్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్

వరంగల్ (పర్వతగిరి) : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదువుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునే వరకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా ముందుకు సాగుతూనే ఉండాలన్నారు. ఆడపిల్లల చదువు దేశానికి సౌభాగ్యమన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను ఉన్నత విద్య చదివించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమ్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ బద్రుద్దీన్, ఆంగ్ల అధ్యాపకుడు శరత్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి


పరిశీలిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ భీమా నాయక్

రాయపర్తి : కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని మండల హెల్త్ సూపర్‌వైజర్ భీమా నాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని పెర్కవేడులో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి చూపును కోల్పోతే మీ జీవితంలో ప్రపంచమే అంధకారమవుతుందని కంటి పరీక్షలను ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నాల తారశ్రీరాజబాబు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌నాయక్, వైద్యాధికారులు మహేష్, శ్రీలక్ష్మి, వంశీ, ఏఎన్ఎంలు అరుణ, రజిత, ఆశ కార్యకర్తలు సంధ్యారాణి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని చెరువు కొమ్ముతండాకు చెందిన ధరావత్ వెంకన్న, ధరావత్ అనిల్, పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన మెరుగు ఐలయ్య, నాగుల వీరయ్య, మామిండ్లపల్లి అనసూర్యలు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లూనావత్ కమలపంతులు, జెడ్పీటీసీ సింగ్‌లాల్, సోమేశ్వర్‌రావు, ఏకాంతం, సర్పంచ్ దేశీరామ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లలో హెచ్చరిక బోర్డులు

సాక్షి ఎఫెక్ట్..


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న జీపీ సిబ్బంది

దుగ్గొండి : అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో ఎలాంటి అనుమతులు రావని కొనుగోలుదారులు నష్టపోతారని వెంచర్లలో గ్రామ పంచాయతీ అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 'సాగుభూముల్లో అక్రమ వెంచర్లు' అనే శీర్షికన సోమవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి కల్పన మండల పంచాయతీ అధికారి శ్రీధర్‌ను అక్రమ వెంచర్‌లపై వివరాలు అడిగారు. అక్రమ వెంచర్‌లను గుర్తించి వెంటనే వారికి నోటీసులు ఇవ్వడంతో పాటు అక్కడ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు గిర్నిబావిలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారికి ఇరువైపులా 7చోట్ల అక్రమ వెంచర్లను గుర్తించారు. యజమానులకు నోటీసులు అందించారు. వెంచర్‌లలో అనుమతులు లేవని ఎవరూ ప్లాట్లు కొనవద్దని ముద్రించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా సెంటర్‌లో పలు చోట్ల అనుమతిలేని వెంచర్‌లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే వచ్చే నష్టాలను వివరిస్తూ ముద్రించిన బ్యానర్‌లను ఏర్పాటు చేశారు. నాచినపల్లి సమీపంలో వెంచర్ యజమాని ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డులను తొలగించారు. అన్నీ అనుమతులు వచ్చిన తర్వాతనే ప్లాట్లు విక్రయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మోడెం శ్రీధర్‌గౌడ్, జీపీ కార్యదర్శులు వైనాల రాజు, ముక్కెర ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి


వర్ధన్నపేటలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో

వర్ధన్నపేట : అవినీతి, అక్రమాలతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకుడిగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కి శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్ధన్నపేట కమిషనర్ గొడిశాల రవీందర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం వర్ధన్నపేట పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాస్తారోకో నిర్వహించడంతో జాతీయ రహదారిపై ఇరువైపుల వాహనాలు నిలిచి ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు నచ్చచెప్పి ఆందోళనను విరమింప చేశారు. ఈ సందర్భంగా జక్కి శ్రీకాంత్ మాట్లాడుతూ వర్ధన్నపేట మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ తనకు ఎదురు లేదని, ప్రభుత్వం తమదేనని అంటూ తాను ఏమి చేసినా తనను అడిగే వారు లేరనే ధీమాతోనే చివరకు బీఆర్ఎస్ కార్యకర్తగా వ్యవహరిస్తూ అడ్డు అదుపు లేకుండా వ్యవహరించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారులను సైతం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల్లాగా మార్చుకుని వ్యవహరిస్తూ పరిపాలన సాగిస్తుండడం సిగ్గుచేటుగా ఉందన్నారు. వర్ధన్నపేట కమిషనర్ తీరుపై కలెక్టర్ విచారణ చేసి వెంటనే సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వర్ధన్నపేట పట్టణ ప్రజలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ అప్సర్, మల్లెపాక సమ్మయ్య, కర్ర శ్రీనివాసరెడ్డి, సింగారపు ఏలియా, తాటికాయల దిలీప్, ఎండీ అక్బర్ బాషా, సమ్మట మల్లయ్య, ఆరెల్లి నాగరాజు, సీనపెల్లి బాబు, రమేష్, యాకయ్య, బుచ్చిబాబు, లక్ష్మి, యాకమ్మ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణ పక్కాగా చేపట్టాలి

ఆత్మకూరు : గ్రామాల్లో చెత్త సేకరణతో పాటు వ్యర్థాల నిర్వహణ పక్కాగా చేపట్టాలని అప్పుడే స్వచ్ఛ గ్రామాలుగా మారుతాయని ఆత్మకూరు ఎంపీపీ సుమలత అన్నారు. స్వచ్ఛ భారత్ రెండో దశలోని లక్ష్యాల సాధనలకు ఆత్మకూరు, దామెర మండలాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీఓ అధ్యక్షురాలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఎంపీపీ మాట్లాడుతూ.. దోమలు లేకుండా ఉండాలంటే ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలకు అధికారులు సహకరించాలని కోరారు. శిక్షకుడు, ఏపీఓ కుమారస్వామి మాట్లాడుతూ.. రాబోయే తరాలు గాలి కూడా కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరిగినప్పుడే సహజ వనరులను భావితరాలకు అందించగలుగుతామన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రజలు ప్లాస్టిక్ రహిత జీవనం అలవాటు చేసుకోవాలన్నారు. ఓడీఎఫ్ ప్లస్ లక్ష్యాలను సాధించేందుకు గ్రామంలోని అన్ని శాఖల ఉద్యోగులు కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

అధికారంలోకి రాగానే శాశ్వత మరమ్మతులు

● మాజీ ఎమ్మెల్యే మాధవరెడ్డి


జోడో యాత్ర నిర్వహిస్తున్న మాధవరెడ్డి

ఖానాపురం : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పాకాల ఆయకట్టు కాల్వలకు శాశ్వత మరమ్మతులు చేయిస్తామని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పాకాల ఆయకట్టు చివరి వరకు నీరందించడానికి కాల్వలపై రెవెన్యూ, పోలీసు, ఐబీ అధికారులను పంపి నీరందించడం జరిగిందన్నారు. ఈ మేరకు మండలంలోని రాగంపేట, కొత్తూరు, రంగాపురం గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్రను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉపాధి హామీ నిధులతో సీసీరోడ్లు వేయిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులేమి కావన్నారు. ఉపాధి హామీ పథకం పకడ్బందీగా అమలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తామన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎమ్మెల్యే ఒక్క మిషన్ పెట్టించి అసంపూర్తి పనులు చేయించాడని, దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం రానున్న రోజుల్లో శ్రీలంక లాంటి పరిస్థితి రాబోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోసాలను గుర్తు చేయడానికే జోడో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. అప్పులు లేని రాష్ట్రంగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మండల యూత్ అధ్యక్షుడు ఎలగందుల రాజు, మహిళా నాయకులు దేవినేని జ్యోతి, పార్వతమ్మ, వీరమనేని సాగర్ రావు, ముస్తాఫా, పొడుపుగంటి మధు పాల్గొన్నారు.

వరిపంటలో తెగుళ్లను నివారించుకోవాలి


వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్

ఖానాపురం : వరి పంటకు సోకుతున్న తెగుళ్లను నివారించుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు మండలంలోని ఖానాపురం, కొత్తూరు, రంగాపురం, మాటువీరారం, తుంగబంధం గ్రామాల్లో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి కాండం తొలిచే పురుగు, మొగి పురుగు ఆశిస్తున్నట్లు తెలిపారు. అక్కడక్కడ జింక్ సూక్ష్మపోషక దాతు లోపం ఉందన్నారు. నివారణకు నాటు వేసిన 25రోజుల లోపు త్రీజి గుళికలు ఎకరానికి పది కిలోల చొప్పన ఇసుకతో కలిపి చల్లుకుంటే తీవ్రత తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వర్లు, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా జాతీయ రహదారి


జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

వర్ధన్నపేట : పట్టణంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై కొన్ని చోట్ల గుంతలు మృత్యు కుహరాలను తలపిస్తున్నాయి. వాహనదారులు ఆదమరిస్తే అందులో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. వర్ధన్నపేటలోని ఎస్సీ కాలనీ వద్ద గల లక్ష్మి గణపతి ఆస్పత్రి ఎదుట జాతీయ రహదారి పై డాంబర్ పూర్తిగా ఎత్తు వంపులతో ప్రమాకరంగా మారింది. దీంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు ప్రమాదకరంగా మారడంతో భారీ వాహనాలు ఇళ్లలోకి చొచ్చుకెళ్లే ప్రమాదం ఉంది. దీంతో స్థానికులు రహదారికి మరమ్మతు చేయాలని కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు చొరవ చూపి తాత్కాలికంగా ప్రమాదాలు జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని ఇల్లంద, కట్ర్యాల, ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద సైతం రహదారికి ఇరుపక్కల సైడ్ బర్మర్‌లు పోయక పోవడంతో బీటీ రోడ్డు పాయలుగా ఏర్పడి ప్రమాదకరంగా ఉంది.

అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న కుమారస్వామి

చెన్నారావుపేట : సంఘం అభివృద్ధికి సభ్యులు సహకరించాలని పొదుపు సంఘాల సమితి అధ్యక్షుడు నూనె కుమారస్వామి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని శ్రమశక్తి పురుషుల పొదుపు సంఘం 23వ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా ఎదగడానికి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. సంఘాలలో ఎప్పటికప్పుడు ఆడిటింగ్ చేయడం జరుగుతుందన్నారు. రుణాలు తీసుకున్న సభ్యులు సకాలంలో అప్పులు చెల్లించి సంఘ అభ్యున్నతికి తోడ్పడాలన్నారు. 637 మంది సభ్యులతో రూ.5 లక్షల లాభాలతో సంఘం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ముత్యం సాంబయ్య, ఉపాధ్యక్షుడు దొంతి సాయిలు, డైరెక్టర్‌లు మెంతుల రమేష్, రంజిత్‌కుమార్, ఎడ్ల రమేష్, సూత్రపు సుధాకర్, పులి రమేష్, ఉపేంద్రచారి, లక్ష్మణచారి, దొనికల వీరభద్రయ్య, బొనగాల శ్రీను, సభ్యులు ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మొద్దు

రాష్ట్ర కిసాన్‌మోర్చా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి


నర్సంపేట: మాట్లాడుతున్న రజనీభారతి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి


పర్వతగిరిలో..

వరంగల్ (పర్వతగిరి) : కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మి ప్రజలు ఓటు వేయొద్దని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర కిసాన్‌మోర్చా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దౌలత్‌నగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎప్పటికైనా ఒక్కటేనని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు అసెంబ్లీ స్థానాలు తక్కువ వస్తాయని ముందే ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. ఆ రెండు పార్టీలకు ఓటు వేస్తే ప్రజలను నట్టేట ముంచుతారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్యే ఒక్కడికే అభివృద్ధి చెందిందని, ప్రజలు అభివృద్ధి చెందలేదని, నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి చెందాలంటే బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కేశవరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

వరంగల్ (పర్వతగిరి) : బీజేపీతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు గోపికరాణి అన్నారు. ఈ మేరకు మండలంలోని చింతనెక్కొండలో ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని జీపీలకు 90శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని, దీంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కృషి సంచాయ్ యోజన కింద రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నారన్నారు. అనేక పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు బన్న ప్రభాకర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్, సీనియర్ నాయకుడు పిచ్చిరెడ్డి, శక్తికేంద్ర ఇన్‌చార్జ్ బత్తిని దేవేందర్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బ్రహ్మచారి, జలంధర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రకటనలే తప్ప.. అమలుకు నోచుకోదు'

నర్సంపేట : బీఆర్ఎస్ ప్రభుత్వానికి పథకాలు ప్రకటన ఇవ్వడమే తప్ప వాటిని అమలు చేయడంలో చిత్తశుద్ధి లేదని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, మాజీ సర్పంచ్ చిలువేరు రజనిభారతి అన్నారు. ఈ మేరకు పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ ఆధ్వర్యంలో పట్టణంలోని 154, 155, 156బూత్‌ల శక్తి కేంద్ర బూత్ అధ్యక్షుడు పుట్టరాజు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఇస్తున్న పథకాలు ఫసల్ భీమా యోజన, ఆయుష్మాన్ భారత్ లాంటి పథకాలను ఇక్కడ అమలు చేయడం లేదని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కొంపెల్లి రాజు, ఉపాధ్యక్షుడు మల్యాల సాంబమూర్తి, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పుట్ట కవిత, బూత్ అధ్యక్షుడు కందగట్ల శివ, అందె వెంకటేశ్వర్లు, కూనమళ్ల పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

యాసంగి సాగుకు యూరియా కొరత


సొసైటీ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలి, ఆరెపల్లి రైతులు యూరియా కొరత ఏర్పడటంతో సోమవారం స్థానిక పీఏసీఎస్ ఎదుట నిరసన తెలిపారు. యాసంగి సాగు చేసిన మొక్కజొన్న, వరికి ప్రస్తుతం యూరియా అవసరమని, సొసైటీ ద్వారా గతంలో ఎరువులను విక్రయించగా ఈ సారి స్టాక్ లేదని అంటున్నారని వారు తెలిపారు. ఇప్పటికే విద్యుత్ కోతలతో సతమతమవుతున్న తమకు యూరియా లేకపోవడంతో నష్టం వాటిల్లుతోందని చెప్పారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మనపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వెంటనే ఎరువులను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.